క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


ఎస్‌ఐ వెంకటరమణ

మక్కువ: మండలం ఎస్‌ఐగా ఎం.వెంకటరమణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఎస్‌ఐగా బాధ్యతులు చేపట్టిన పి.నరసింహమూర్తి సాలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లగా, సాలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో పని చేసిన వెంకటరమణ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది సహకారంతో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు. సారా తయారీ, విక్రయాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆర్డీఓ విచారణ

పాచిపెంట: మండలంలోని పాంచాలి గ్రామానికి చెందిన కలువలపల్లి అప్పలకొండ అనే మహిళ రైతు తాను సాగుచేస్తున్న జిరాయితీ భూమిలో కొంత భూమి 22ఏ కింద నమోదైందని, దాన్ని సరిచేయాలని కోరుతూ ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అర్జీ పెట్టకుంది. దీనిపై పార్వతీపురం ఆర్డీఓ హేమలత బుధవారం విచారణ చేపట్టారు. పాంచాలి వెళ్లి ఆ మహిళా రైతు సాగుచేస్తున్న పొలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ డి.రవి నుంచి వివరాలు సేకరించారు. వారి వెంట ఆర్‌ఐ వెంకటరమణ, మండల సర్వేయర్, తదితరలు ఉన్నారు.

ఎట్టకేలకు ఎస్‌ఎంసీ ఎన్నిక పూర్తి


ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్, సభ్యులు

బలిజిపేట: నారన్నాయుడువలస ఉన్నత పాఠశాల చైర్మన్‌గా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు ఎడ్ల తవుడు ఎన్నికయ్యారు. పాఠశాల హెచ్‌ఎం ఆధ్వర్యంలో బుధవారం ప్రశాంతంగా ఎన్నిక నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తామని ఎన్నికైన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు తెలిపారు. గతంలో హైడ్రామాలు, వాగ్వాదాలతో ఎస్‌ఎంసీ ఎన్నిక వాయిదాపడిన విషయం విదితమే.

నీలకంఠాపురంలో ప్రజాదర్బార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని నీలకంఠాపురంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి వినతులు అందజేశారు. ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్, నాయకులు కోలా రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

సందర్శన


మాట్లాడుతున్న ఐటీడీఏ డిప్యూటీ ఈఓ నారాయుడు

సీతంపేట: ఐటీడీఏ డిప్యూటీ ఈఓ పి.నారాయుడు పలు ఆశ్రమ పాఠశాలలు, జీపీఎస్ పాఠశాలలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పూతికవలస పాఠశాలలో జరుగుతున్న ఎఫ్‌ఏ -1 పరీక్ష తీరును పరిశీలించారు. అలాగే చిన్నబగ్గ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేశారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. వంద శాతం రిజల్ట్ రావడానికి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. గోరపాడు, గూడంగి కాలనీలను కూడా సందర్శించారు. కార్యక్రమంలో సీఎంఓ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


సాలికిరిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

భామిని: మండలంలోని సాలికిరికి చెందిన కిల్లారి మిన్నారావు (44) హైదరాబాద్‌లో ఇటీవల మృతి చెందారు. అలాగే తాలాడకు చెందిన వలరౌతు నిరంజన్ (49) వంశధార నదిలో మునిగి మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం ఆయా గ్రామాలను సందర్శించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తకోట చంద్రశేఖర్, దామోదర కంఠయ్య, రొక్కం రామారావు, పగడాలమ్మ, వై.పాపినాయుడు, వలరౌతు రామకృష్ణ, భూపతి కిరణ్, కార్యకర్తలున్నారు.

మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలి



కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి. ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రైమరీ హెల్త్ సెంటర్లలో పనిచేసే మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలి. ప్రతీ ఆస్పత్రిలో పోలీసు అవుట్‌పోస్టు ఏర్పాటు చేయాలి. అలాగే మహిళా డాక్టర్‌కు రక్షణగా ఒక మహిళా సెక్యూరిటీని నియమించాలి. ఆస్పత్రులకు ఒక్కోసారి పేషెంట్‌తో పాటు పది మందికి పైగా సహాయకులు వస్తుంటారు. వారిలో కొందరు ఆస్పత్రి సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తుంటారు. అటువంటి సమయాల్లో సిబ్బందికి భద్రత అవసరమవుతుంది. పోలీసు సెక్యూరిటీ ఉంటే దాడి చేయాలనుకునే వారిలో భయం కలుగుతుంది.

– డాక్టర్ సుజాత, తోణాం పీహెచ్‌సీ, సాలూరు



నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు

- మరణించినా.. మరికొందరికి లోకం చూపించే అదృష్టం
- అపోహలు వీడి నేత్రదానానికి ముందుకురావాలని పిలుపు
- జిల్లాలో కొనసాగుతున్న నేత్రదాన పక్షోత్సవాలు


కురుపాం మండల కేంద్రంలో నేత్రదాన పక్షోత్సవాల కార్యక్రమం

పార్వతీపురంటౌన్:

'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అన్నారు పెద్దలు. ఇంద్రియాలన్నింటిలో కళ్లు ప్రధానమైనవి అని అర్థం. వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. మనం మరణించినా మన కళ్లతో మరో ఇద్దరికి ఈ లోకాన్ని చూపే అదృష్టం నేత్రదానంతోనే సాధ్యం. కంటిలోని కార్నియాను సేకరించి అంధత్వంతో బాధపడేవారికి అమర్చడం ద్వారా వారి జీవితాల్లో వెలుగు రేఖలు ప్రసరింపచేయవచ్చు. నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వాలు ఏటా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాయి. కంటి చూపు లేక చీకట్లో మగ్గుతున్న వారెందరికో కంటి చూపును ప్రసాదించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి నేత్రదానం చేయాలి.

• నేత్రదానం ఆవశ్యకత

దేశంలో ప్రతి ఏడాది వివిధ కారణాల వలన 50 లక్షల పైచిలుకు మంది మరణిస్తున్నారు. కానీ దేశంలో 50,000 మంది మాత్రమే తమ మరణానంతరం నేత్రదానం చేస్తున్నారు. అంతేకాకుండా ప్రతి ఏడాది 25 వేలు కొత్త కార్నియా అంధత్వ కేసులు నమోదవుతున్నాయి.

మనదేశంలో కార్నియా అంధత్వ నివారణకు ప్రతి ఏటా రెండు లక్షల మంది నేత్రదానం చేయాల్సి ఉంది. ఇప్పటికే పలు స్వచ్ఛంద సంస్థలు ఈ మేరకు కృషి చేస్తున్నాయి. కానీ ప్రజల్లో సరైన అవగాహన లేక నేత్రదానం చేసేందుకు ముందుకురావడం లేదు. మనిషి మరణానంతరం కళ్లను మట్టిలో కలిపేయకుండా వాటిని(కార్నియా) దానం చేయడం ద్వారా కంటిచూపులేని మరో ఇద్దరికి చూపు ఇవ్వొచ్చు. కాబట్టి ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసేందుకు ముందుకురావాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

• నేత్రదానం ఎవరికి అవసరం..

కంటిలోని కార్నియాపైన మచ్చలు ఉన్నవారికి నేత్రదానం అవసరం. నల్లగుడ్డుపై మచ్చలు ఏర్పడడానికి ప్రధానంగా చిన్నారుల్లో పోషకాహార లోపం, మీజిల్స్, సంక్రమణ కంటి వ్యాధులు, గాయాలు బారిన పడడం, కంటి శస్త్ర చికిత్సలు అనంతరం ఇన్ఫెక్షన్స్ సోకడం, పుట్టుకతో వచ్చే కంటి వ్యాధులు కారణంగా చూపు దెబ్బతిన్నవారికి అవసరం.

• నేత్రదానం ఎవరు చేయవచ్చు

వయసు, కులము, మతము, లింగ బేధము లేకుండా ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయవచ్చు. రక్తపోటు, చక్కెర వ్యాధి, ఆస్తమా వంటి వ్యాధులతో బాధపడుతున్నవారు, గతంలో కంటి శస్త్రచికిత్సలు చేసుకున్న వారు, కంటి అద్దాలు వాడుతున్న వారు కూడా నేత్రదానం చేయవచ్చు.

• ఎవరి నేత్రాలు పనికిరావు

హెచ్‌ఐవీ/ఎయిడ్స్, పచ్చకామర్లు(బి,సి), సెఫ్టిసీమియా, లుకేమియా (బ్లడ్ క్యాన్సర్), రాబిస్ (కుక్కకాటు), మెదడు వాపుతో చనిపోయిన వారి నేత్రాలు దానం చేయడానికి పనికిరావు.

• నేత్రదానం పక్రియ

ఒక వ్యక్తి మరణానంతరం ఆరు గంటల్లో నేత్రాలు సేకరించాల్సి ఉంటుంది. నేత్రదానం చేయవలసిన వ్యక్తి ముందుగా నేత్రదాన ప్రతిజ్ఞ పత్రం ఇవ్వవలెను, లేదా మరణానంతరం కూడా వారి కుటుంబ సభ్యులు నేత్రదానం చేసేందుకు ముందుకు రావచ్చు. నేత్రదానం చేయదలచిన వారు సమీపంలోని కంటి ఆస్పత్రిలో గాని, ఐ బ్యాంక్‌లో, రెడ్‌క్రాస్ సొసైటీ నేత్ర సేకరణ కేంద్రంలో గాని, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో కానీ సంప్రదించాలి. మరణాంతరం దాత తలకింద తలగడను పెట్టవలెను. రెండు కళ్లను మూసివేసి నీటిలో ముంచిన పరిశుభ్రమైన తడి దూది గాని లేదా తడిరూమాలు గాని పెట్టవలెను. ఫ్యాను ఆపివేయాలి.

నేత్రదానంతో చూపు ప్రసాదించవచ్చు

కార్నియల్ అంధత్వంతో చూపు కోల్పోయిన వారికి నేత్రదాతల నుంచి సేకరించిన కారిన్నియా మార్పిడి ద్వారా కంటిచూపు ప్రసాదించవచ్చు. ప్రత్యామ్నాయం లేదు కాబట్టి ప్రజలందరూ నేత్రదానం పట్ల అవగాహన పెంచుకోవాలి. ఎవరైనా మరణించిన తర్వాత వారి బంధువులు నేత్రదానానికి అంగీకరించి సమాచారాన్ని నేత్ర సేకరణ కేంద్రానికి వెంటనే తెలియజేయాలి. జిల్లాలో పారామెడికల్ ఆప్తాల్మిక్ అధికారుల ద్వారా నిర్వహిస్తున్న కంటి పరీక్ష శిబిరాల్లో నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ సుకుమార్ బాబు, జిల్లా అంధత్వ నివారణ అధికారి

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- ఎంపీపీ బడ్నాన ప్రమీల


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బడ్నాన ప్రమీల

పాచిపెంట: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ బడ్నాన ప్రమీల అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన హెచ్‌డీఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో అనేక మంది ప్రజలు మలేరియా, డెంగీ వంటి విషజ్వరాల బారినపడుతున్నారని, వారికి సకాలంలో నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు. పీహెచ్‌సీలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. హెచ్‌డీఎస్ నిధులతో అవసరమైన మందులు కొనుగోలు చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రోగుల ప్రాణాలకు ఎలాంటి ముప్పువాటిల్లినా వారిని ఉపేక్షించేది లేదన్నారు. గ్రామాల్లో ఉన్న ఆరోగ్య సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు జి.వెంకటరమణ, రవిచంద్ర, స్థానిక సర్పంచ్ పాచిపెంట సంతోషి, ఎంపీటీసీ దండి ఏడుకొండలు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పాత్రుడు, తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ జన్ని ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

30న హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ

పార్వతీపురంటౌన్: హెచ్‌ఐవీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 30న 'రెడ్ రన్' ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఎం.వినోద్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూత్ ఫెస్ట్ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు ఆర్‌సీఎం సెయింట్ పీటర్స్ స్కూల్ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు మారథాన్/ర్యాలీ కొనసాగుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ర్యాలీని ప్రారంభిస్తారని, ఈ ర్యాలీ ద్వారా హెచ్‌ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారిలో ఉన్న అనుమానాలను, అపోహలను నివృత్తి చేయనున్నట్లు తెలిపారు. కళాశాల విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్, ఆర్‌ఆర్‌సీ వలంటీర్లతో పాటు ప్రతి ఒక్కరూ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి


మధ్యాహ్న భోజనంను పరిశీలిస్తున్న ఎంఈఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన కార్యక్రమంలో మెనూను సక్రమంగా అమలు చేయాలని ఎంఈఓ ఎన్.నాగభూషణరావు అన్నారు. మండలంలోని కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని సూచించారు. పథకం నిర్వహణలో లోపాలుంటే నిర్వాహకులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు కోలక అవినాష్

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు(గ్రీన్ అంబాసిడర్లు)కు బకాయి వేతనాలు చెల్లించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు కోలక అవినాష్ డిమాండ్ చేశారు. ఈమేరకు గుమ్మలక్ష్మీపురంలోని గిరిజన సంఘం కార్యాలయంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలకు చెందిన పారిశుధ్య కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. బకాయి వేతనాల సాధనకు చేపట్టాల్సిన కార్యచరణపై చర్చించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. వారికి ఉపాధిహామీ పనులను కూడా నిరాకరిస్తుండడం శోచనీయమన్నారు. బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, ఇకపై ఏ నెల వేతనం ఆ నెలే చెల్లించాలని, చెత్త రిక్షాలు పూర్తిగా పాడైనందున కొత్తవి మంజూరు చేయాలని, హ్యాండ్ గ్లౌజులు, షూష్ అందజేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లించని పక్షంలో కార్మికుల తరపున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మండంగి సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి


కలుపు తీయడంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

వీరఘట్టం: పంట పొలాల్లో కలుపు నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ శాఖాధికారి జె.సౌజన్య అన్నారు. మండలంలోని చలివేంద్రి గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించి, కలుపు నివారణపై అవగాహన కల్పించారు. కలుపు నివారిస్తే పంట ఏపుగా పెరిగి దిగుబడి బాగుంటుందన్నారు. అలాగే రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ విధానంలో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆమెతో పాటు అగ్రికల్చరల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు ఐటీఐలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో ప్రవేశాలకు గురువారం మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. ఆయా ట్రేడులు పూర్తిచేసిన విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించి ఉద్యోగాలు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఇసుక మేటల పరిశీలన


ఇసుక మేటలను పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళి, తదితరులు

భామిని: మండలంలోని కాట్రగడ – బి వద్ద వంశధార నదిపై నిర్మించిన ఓపెన్ హెడ్ చానల్‌లో పేరుకుపోయిన ఇసుక మేటలను పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళి, స్థానిక తహసీల్దా ర్ ఆర్.ఉమామహేశ్వరరావు బుధవారం పరిశీలించారు. వియ్యర్‌లో పేరుకుపోయిన ఇసుక మేటల ను తొలగించేందుకు అనువైన మార్గాన్ని చూశారు. ఇసుక లారీల రవాణాకు అడ్డంకుల్లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్ర మంలో ఎస్సై డి. అనిల్‌కుమార్, ఆర్‌ఐ ఎస్. రాంబాబు వీఆర్‌ఓలు, పోలీసులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జగన్మోహనరావు


బాగువలస పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జగన్మోహనరావు

సాలూరు రూరల్: పీహెచ్‌సీల్లో పనిచేసే సిబ్బంది అన్ని వేళల్లో రోగులకు వైద్య సేవలందించేందుకు అందుబాటులో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. టి.జగన్మోహనరావు అన్నారు. బాగువలస పీహెచ్‌సీ, గర్భిణుల వసతిగృహం, సాలూరులో బాలుర వసతి గృహాన్ని మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ఓపీ రికార్డులను తనిఖీ చేశారు. జ్వర లక్షణాలతో ఎంతమంది వస్తున్నారు, రాత్రి వేళల్లో ఎలాంటి సమస్యలతో రోగులు వస్తున్నారు, వారికి అందిస్తున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఆర్‌బీఎస్ అధికారి డా. రఘుకుమార్, డా.రవికరణ్ ఉన్నారు.

తగాదా కేసులో వ్యక్తి అరెస్ట్

పాచిపెంట: పొలంలో పశువులు కట్టే క్రమంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే తగాదాలో, ఓ వ్యక్తిపై కేసునమోదు చేసి అరెస్టు చేసినట్లు హెచ్‌సీ కృపారావు బుధవారం తెలిపారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెదతాడురు గ్రామానికి చెందిన యాసర్ల హరీష్, ఈశ్వరరావు గ్రామ సమీపంలో ఉన్న పొలంలో ఈ నెల 17న రాత్రి సమయంలో పశువులు కట్టే క్రమంలో గొడవ పడ్డారు. ఈ గొడవలో ఈశ్వరరావుపై హరీష్ గడ్డపారతో దాడిచేశాడు. ఈ దాడిలో గాయపడి ఈశ్వరరావు పాచిపెంట పోలీస్ స్టేషన్‌లో హరీష్‌పై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేసి బుధవారం నిందితుడిని అరెస్టు చేశారు.

తాగునీటి ఇక్కట్లు


ట్యాంక్ నుంచి వృథాగా పోతున్న నీటిని పట్టుకుంటున్న మహిళలు


ప్రారంభానికి నోచుకోని రక్షిత మంచినీటి పథకం

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ కేంద్రుక గైశీల గ్రామంలోని ప్రజలు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. గ్రామంలో గతంలో ఏర్పాటుచేసిన మినీ రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ మరమ్మతులకు గురై, తాగునీరు వృథాగా పోతుంది. ట్యాంక్ పాడవ్వడంతో ఎప్పటికప్పుడు అందులోకి నీరు ఎక్కించి, తాగునీరు పట్టుకోవాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. విద్యుత్ సరఫరా లేని సమయంలో బోరుబావి, నేలబావి నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామంలో నిర్మిస్తున్న రక్షిత మంచినీటి పథకం పనులు పూర్తికాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు అంటున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి జోగారావు వివరణ కోరగా, రక్షిత మంచినీటి పథకం పనులు పూర్తియ్యాయని, పైపులైన్, మోటార్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అయిదు రోజుల్లో పనులు పూర్తిచేసి ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తామని తెలిపారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజేష్

సీతానగరం: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని, నిషేధిత పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఎం.రాజేష్ సూచించారు. మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ప్రిన్సిపాల్ ఈశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రోడ్డు భద్రత నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఖైనీ, గుట్కా, తంబాకు, గంజాయి వంటి నిషేధిత పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు అన్ని విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు


వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు

పార్వతీపురంటౌన్: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలని ఏపీసీఎన్‌ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని పెద బొండపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. రసాయనాలు లేకుండా సాగు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పొందవచ్చని, వీటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. అలాగే పొలం గట్లపై కంది, మునగ, బంతి, అరటి, కూరగాయ పంటలు వేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ శారద, కేవీకె శాస్త్రవేత్త అమృతవీణ, ఎన్‌ఎఫ్‌ఏ వై.తిరుపతి, ఎంటీ శ్రీరాములు, రైతులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ కార్యాలయాన్ని తరలించవద్దు

- ఇన్‌చార్జ్ పీఓకు మాజీ ఎమ్మెల్యే కళావతి వినతి


ఇన్‌చార్జ్ పీఓకు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

సీతంపేట: ఐటీడీఏకు అనుబంధంగా నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ డీడీ కార్యాలయాన్ని శ్రీకాకుళానికి తరలించవద్దని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కోరారు. ఈ మేరకు ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ వీవీ రమణను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజన విద్యాసంస్థల పరిపాలన అంతా ఇక్కడి నుంచే కొనసాగించాలన్నారు. స్థానిక గిరిజనులు తమ పనుల నిమిత్తం శ్రీకాకుళం వెళ్లాలంటే చాలా ఇబ్బందని తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తరలింపు ఆపాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్.మోహన్ రావు, ఎన్.కృష్ణ, అబ్బాస్, ఎన్.కాంతారావు, సోమేష్, తదితరులు పాల్గొన్నారు.